క్లుప్తంగా

హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఇచ్చోడ: హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంప్రదాయ రంగులతో హోలీని జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. ముఖ్యంగా యువత చెరువులు, బావుల్లో స్నానాలు చేసేందుకు వెళ్లవద్దన్నారు.

నేడు అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతంలోని ఆదిలాబాద్ రూరల్ మండలంలో గల బేల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను మూర్తి గురుస్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంభోజి సూర్యకాంత్, దాముక రవి తెలిపారు. ఆదివారం వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకల సందర్భంగా ముందుగా గణపతి హోమం, అయ్యప్ప స్వామికి నవకల్ప అభిషేకం, మహా హారతి, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

యువకుడికి సన్మానం

తాంసి: మండల కేంద్రానికి చెందిన యువకుడు బెల్లపు నగేశ్ ఇటీవల విడుదలైన గురుకుల జూనియర్, డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించాడు. కాగా.. ఉద్యోగాలు సాధించిన యువకుడిని ఆదివారం మండల కేంద్రంలో మాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాలీ సంఘం నాయకులు బెల్లపు గంగారం, ఆశన్న, ప్రవీణ్, దీపక్, అశోక్, పెంటన్న, సాయిరాం పాల్గొన్నారు.

రజక సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: రజక సంఘం ఆదిలాబాద్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా మల్యుల్‌వార్ సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ముస్కు వినోద్‌లు ఎన్నికయ్యారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

అన్నదానం

కైలాస్‌నగర్: దసరా, దీపావళి, రంజాన్ వంటి పండగ ఏదీ వచ్చినా పేదల కడుపు నింపడమే తమకు నిజమైన పండుగ అని సంగెం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది సంగెం సుధీర్ కుమార్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 157వ వారానికి చేరింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేదలకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమానికి ప్రభుత్వ న్యాయవాది మేకల మధుకర్, న్యాయవాదులు సంతోష్, దేవేందర్, స్వామి, ప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సుభాష్, అంబయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పేర్లకు గిరాకీ

ఇచ్చోడ: హోలీ పండుగతో చక్కెర పేర్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారం ఇంకా కొనసాగుతోంది. కామ దాహనం మరుసటి రోజు రంగుల పున్నం రోజు ఉదయం చక్కెర పేర్లను తమ సమీప బంధువులకు అందచేయడం అనావాయితీగా వస్తోంది. సంప్రదాయం, ఒక్కరిఇంటికి ఒక్కరూ వెళ్లి చక్కెర పేర్లను ఇచ్చిపుచ్చుకుంటారు. సోమవారం హోలీ ఉన్నందున ఆదివారం మండల కేంద్రంలో పలు కూడళ్లలో చక్కెర పేర్ల విక్రయాల జోరుగా సాగాయి.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ మొగిలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఉట్నూర్ సీఐ మొగిలి పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, కాంగ్రెస్ నాయకులు సోమోరే నాగోరావ్, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి పండుగ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలో పెద్దమ్మతల్లి పండుగను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు వీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కామ దహనం

- కుడుకలు, చక్కెర బిల్లలు సేకరించిన గ్రామ పెద్దలు
- గ్రామశివారులో ప్రత్యేక పూజలు



బేల: ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు



ఆదిలాబాద్‌రూరల్: కామునిదహనం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సుద్దగూడ, రాజదేవుషాగూడ, ఘన్పూర్, అయన గ్రామాల్లో కాముని దహనం చేశారు. సోమవారం ఏజెన్సీ వ్యాప్తంగా హోలీ పండుగ జరుపుకోనున్నారు. ఆదివారం ప్రతీ కుటుంబం నుంచి గ్రామస్తుల సమక్షంలో గ్రామ పెద్ద ఇంట్లో కుడక ఇచ్చి గ్రామ కుటుంబాల జాబితాలో చేరడం అనవాయితీగా వస్తోంది. తరాలు మారిన తమ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కుడక ఇవ్వని కుటుంబాన్ని బహిష్కరించినట్లు పరిగణిస్తారు. కామ దహనానికి అగ్గి పెట్టె వినియోగించకుండా ప్రకృతి సిద్ధంగా ఉన్న రాయిని రాయితో కొట్టి పుట్టించిన అగ్గితో కామ దహనం చేస్తా రు. మరుసటి రోజు ప్రత్యేక వాయిద్యాల మధ్య నృత్యం చేస్తూ.. హోలీ ఆడుతారు.

బోథ్: మండల కేంద్రంతో పాటు సొనాల, మర్లపెల్లి, పొచ్చెర, ధన్నూర్(బి), కుచులాపూర్, కనుగుట్ట, కౌఠ(బి)తో పాటు పలు గ్రామాల్లో ఆదివారం కామదహనం చేశారు. పౌర్ణమి, హోలీ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం రాత్రి కామ దహనం చేశారు. గ్రామం చివరలో ఏర్పాటు చేసిన కామ దహనం వద్దకు గ్రామస్తులు డప్పుచప్పులతో వెళ్లి పూజలు చేశారు. అనంతరం కామ దహనం నిర్వహించి చుట్టూ నీళ్లు పోశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

బేల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం కామదహనం నిర్వహించారు. బేలలో దేశ్‌ముక్ వంశస్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఆయా కాలనీల్లోని కూడలిలో ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించి కామదహనం చేశారు. కార్యక్రమంలో దేశ్‌ముక్ ఉత్తంరావు, కల్యాణ్‌కార్ గజానన్, రాకేశ్, దేవిదాస్, ఉర్వతే సచిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పందిర్‌లొద్దీ గ్రామంలో శేకు పటేల్, దేవరి రావుజీల ఆధ్వర్యంలో హోలీ పండుగ జరుపుకున్నారు. గ్రామ పెద్ద జంగు పటేల్ మాట్లాడుతూ.. వసంత కాలంలో వాతావరణంలో మార్పులు జరగటంతో వైరల్ జ్వరం, జలుబు వస్తాయని ప్రజలు విశ్వసిస్తారన్నారు. అందుకోసం సహజమైన రంగు పొడిలను చల్లుకోవడంతో ఔషధంగా పని చేస్తుందన్నారు. సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలన్నారు.

నార్నూర్: నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలంలో ఆదివాసీ గిరిజనులు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయ ప్రకారం కామదహనం చేశారు. మాన్కాపూర్‌లో గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తరతరాల నుంచి వస్తున్న సంస్కతి సాంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, గ్రామపెద్దలు కొట్నాక్ నానాజీ, బాజీరావు, ఏత్మారావు, సుంగు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అటవీ ప్రాంత నుంచి మాతరి.. మాత్రల్ పేర్లతో రెండు వెదురు బొంగులను గ్రామాలకు తీసుకువచ్చారు. గ్రామ పెద్దల సమక్షంలో ప్రతీ ఇంటి నుంచి కుడుకలు, చక్కెర బిల్లలు సేకరించారు. దీంతో కుటుంబాల లెక్కను నిర్ధారించారు. అనంతరం అటవీ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన రెండు వెదురు బొంగులకు కుడుక, మొదుగ పూలు, చక్కెర బిల్లలు ఏర్పాటు చేసి, వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల పోలిమేరలో కామదహనం చేశారు. సోమవారం ఉదయం హోలీ పండుగ నిర్వహించనున్నటు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కోరెంగా లింగుపటేల్, ఆత్రం శంకర్, పోల్లుగూడ, సిడాం భుజంగ్‌రావ్, హనుమంత్‌రావ్, జుగ్నాక్ భారత్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి వద్ద హోలీ సంబురాలు



నేరడిగొండ: డప్పు కొడుతున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటి వద్ద హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం ఆయన నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ డప్పు వాయిస్తూ అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బోథ్ నియోజకవర్గ ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపి కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు.



ఇంద్రవెల్లి: చక్కర బిల్లలు ఏర్పాటు చేస్తున్న ఆదివాసీలు



బోథ్‌లో..



ఉట్నూర్‌రూరల్: కుడకలు సేకరిస్తున్న గ్రామపెద్దలు



తాంసి: కామ దహనం చేస్తున్న గ్రామస్తులు

ఉపాధికూలీలకు వసతులు కల్పించాలి

తాంసి: ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి చిలుక దేవిదాస్ కోరారు. మండలంలోని గోట్కూరి శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీపీఐ నాయకులు రమేశ్, అశోక్, భగువాండ్లు ఉన్నారు.

చదువుతోనే విజ్ఞానం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

తలమడుగు: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, చదువుతోనే విజ్ఞానం పెరుగుతుందని జిల్లా ఎస్సీ స్టడీ డైరెక్టర్ రమేశ్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ అన్నారు. ఆదివారం బరంపూర్ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సహకారంతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మేకల మురళీధర్, ప్రధాన కార్యదర్శి ముజిబుల్ రహమాన్, నారాయణ రెడ్డి, విజయ్ కుమార్, నగేశ్, నర్సిములు, హరికాంత్, సుధీర్, ప్రశాంత్, నాగరావు, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, గడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని బోరిగామలో ఆదివారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది మాట్లాడుతూ.. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. వర్షకాలంలో పశువులకు గాలికుంటు సోకకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శేఖర్, దేవురాలు పాల్గొన్నారు.

తీరనున్న అద్దె కష్టాలు

- అంగన్‌వాడీలకు సొంత భవనాలు
- నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయం



అద్దె ఇంట్లో కొనసాగుతున్న సిరికొండ అంగన్‌వాడీ కేంద్రం

సిరికొండ: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె కష్టాలు తప్పనున్నాయి. గత సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అంగన్‌వాడీ భవనాలు లేని గ్రామంలో ఉపాధిహామీ నిధులతో భవనాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాడు. దీంతో అనేక గ్రామాల్లో అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించనున్నారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు..

మండలంలోని సిరికొండ, వాయిపేట్ రెండు ఐసీడీఎస్ సెక్టార్లు ఉన్నాయి. సిరికొండ సెక్టార్‌లో 21 కేంద్రాలు, వాయిపేట్ సెక్టార్‌లో 22 కేంద్రాలున్నాయి. ఈ రెండు సెక్టార్‌లలో అంగన్‌వాడీ కేంద్రాలు సిరికొండ సెక్టార్ కింద పక్క భవనాలు 7, అద్దె భవనాలు 4, పాఠశాలలో భవనాలు 7, గ్రామ పంచాయతీల్లో 3 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వాయిపేట్ సెక్టార్‌లో పక్కా భవనాలు 12, అద్దె భవనాలు 2, పాఠశాలలో భవనాలు 3, పంచాయతీ భవనాల్లో 5 కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఎక్కడా కూడా కనీస వసతులు లేవు. అలాగే ఇరుకు గదులు ఉండడంతో పిల్లలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు కేంద్రాల్లోకి చేరడంతో నీటిని బయటకు తొడేసే వరకు పిల్లలను బయట ఉంచడం జరుగుతుంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

ఉపాధి నిధులతో..

రాష్ట్రంలో అంగన్‌వాడీ భవనాలు లేని ప్రాంతంలో ఉపాధిహామీ పథకం నిధులతో పక్కా భవనాలు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అద్దె భవనాల్లో, ఇరుకు గదుల్లో, వసతులు లేకపోవడంతో ఇటీవల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వెంటనే భవన నిర్మాణాలు చేపట్టి తమ ఇబ్బందులను దూరం చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదలను పంపిస్తాం



మండలంలో ఉన్న రెండు సెక్టార్‌లో ఎక్కడైతే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవో వాటిపై అధికారులకు ముందే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం ఇప్పుడు కోరిన కూడా మళ్లీ ప్రతిపాదలనలు పంపిస్తాం.

– సౌందర్య, సీడీపీవో, బోథ్

ఇబ్బంది పడుతున్నాం



సిరికొండ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. కొన్ని సంవత్సరాల నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది. ఎక్కడా ఎలాంటి సౌకర్యాలు లేవు. వంట గది కూడా లేదు. తోట ఏర్పాటు చేయడానికి స్థలం లేక పిల్లలకు కూరగాయలు పండించాలేకపోతున్నాం.

– ముత్యపు మౌనజ, అంగన్‌వాడీ కేంద్రం 1, ఆయా

ఎలుకలు ఉన్నాయి

అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులను భద్రపర్చడం కష్టంగా మారింది. సొంత భవనం లేక, చిన్న ఇంట్లో కొనసాగుతోంది. ఎలుకలు ఎక్కువగా ఉండడంతో సరుకులను చాలా వరకు పాడు చేస్తున్నాయి. వర్షకాలంలో వర్షపు నీరు చేరుతోంది. సరుకులు, వస్తువులు తడుస్తున్నాయి.

– రాణి, అంగన్‌వాడీ టీచర్, సిరికొండ

అదుపు తప్పితే అంతే..



ఆదిలాబాద్‌రూరల్: కోతకు గురైన రోడ్డు



బోథ్: గుంత వద్ద రాళ్లను పేర్చిన యువకులు

ఆదిలాబాద్‌రూరల్: గతంలో కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు కోతకు గురయ్యాయి. వాటి మరమ్మతులకు కావాల్సిన నిధులపై అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. నెలలు గడుస్తున్నా.. కొన్ని చోట్ల ఎలాంటి మరమ్మత్తులు చేయకుండా వదిలేశారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామం నుంచి పోతగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో వంతెన సమీపంలో రోడ్డు కోతకు గురైంది. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత

బోథ్: మండలానికి సమీపంలని చింవోలి గ్రామం వద్ద హనుమాన్ ఆలయ సమీపంలో బోథ్ ఎక్స్ రోడ్డుకు వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గమనించిన బోథ్‌కు చెందిన ప్రవీణ్‌తో పాటు పలువురు యువకులు తాత్కాలికంగా గుంత చుట్టూ రాళ్లు పేర్చారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపికృష్ణలు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశు మందిర్‌లో ఆదిలాబాద్‌రూరల్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా విద్యారంగ సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ వార్డెన్‌లు, ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడిగా వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, ఆర్థిక కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా రాంజీ, కార్యదర్శులు అర్జున్ పవార్, శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా జంగులను నియమించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



ప్రజలతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 46.50 లక్షల నిధులు కేటాయించామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ఆదివారం పిప్రి గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంగయ్య ఇంట్లో నిర్వహించిన శుభకార్యంలో పాల్గొన్నారు. తాగునీటి సమస్య ఉన్న కాలనీల్లో రూ.1లక్ష ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణరెడ్డి, రాజారాం, యువజన సంఘం మండల దుబ్బుల చంద్రశేఖర్, తాజామాజీ సర్పంచ్‌లు కవిత రఘునరెడ్డి, ఫడ్ జ్ఞానేశ్వర్, నారమ్మ లక్ష్మణ్, సాయన్న, ప్రశాంత్, దీసీ రమణ, సుధాకర్, వినోద్, ప్రభు, మారుతి, మల్లేష్, శ్రీనివాస్, సుకుమార్ పాల్గొన్నారు.

బోరుబావులు ఏర్పాటు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని బొడగుట్ట వద్ద ఉన్న జైశ్రీరాం గోశాల వద్ద ఆదివారం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారి జేజే పటేల్ సొంత డబ్బులతో రెండు బోర్లు వేయించారు. పశువులకు తాగునీరు ఇబ్బంది లేకుండా గోశాల నిర్వాహకుడు ఐద రాజేశ్వర్ విజ్ఞప్తి మేరకు బోరు బావులు వేయించాడు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

ఇంద్రవెల్లి: గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చొరవతో మండలంలోని ధీంనగర్, అంజీ గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా బొరుబావులు వేయించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుదాస్, కాంగ్రెస్ నాయకులు సోమోరే నాగోరావ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ నాగేందర్

నార్నూర్: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చొర్గవ్ గ్రామంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి అమ్మిన, గుడుంబా తయారు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. చొర్గవ్ గ్రామాన్ని మద్య పానం, గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామపెద్దలు తీర్మానం చేయాలన్నారు. సీఐ రహీంపాషా, ఎస్సై రవి కిరణ్, గ్రామపెద్దలు రమేశ్ నాయక్, నర్సాడ్, లాటియా అర్జున్, సేరు, గోవిందు తదితరులు ఉన్నారు.